# శరవేగంగా కాలేజీల భవన నిర్మాణం

● రూ. 25 కోట్లతో నర్సింగ్ కళాశాల ● రూ. 2 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ● వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి



కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు

తాండూరు, డిసెంబర్ 14: తాండూరు నియోజకవర్గంలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ మార్గంలోని మాతా శిశు ఆసుపత్రి సమీపంలో రూ.25 కోట్లతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలతో పాటు తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో తాండూరులో విద్యావ్యవస్థలో మంచి మార్పులు రానున్నాయి. నిజాం పాలనలో కట్టించిన తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థల ఉండడంతో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో జూనియర్ కళాశాల భవన నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఇంటర్ విద్యార్థులు తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. దశాబ్దాల నుంచి మౌళిక వసతులు తేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు స్థానిక నేతలు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకు వెళ్లడంతో స్పందించిన అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండరు వేసి వెంటనే పనులు ప్రారంభించారు. నాణ్యతలో ఏ మాత్రం రాజీపడకుండా నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. బషీరాబాద్ మండలంలో కూడ జూనియర్ కళాశాల భవన నిర్మాణపనులు త్వరగా ప్రారంభించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముహూర్తం చేయనున్నారు. నర్సింగ్ కళాశాల పనులు కూడా 30 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేయనున్నట్లు సంబంధిత శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇటీవల వివిధ శాఖల అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నాణ్యతలో తేడా రాకూడదన్నారు.



కొనసాగుతున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు

## అధైర్య పడొద్దు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి, డిసెంబర్ 14 : కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని కోటమర్పల్లి, బుచన్‌పల్లి గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవిస్తూ.. అందరికీ అండగా ఉంటానన్నారు. ప్రజల మధ్యనే ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కష్ట సమయంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను కాపాడుకుంటానన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రాచయ్య, యూత్ అధ్యక్షుడు మధుకర్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్యగౌడ్, నాయకులు యాదవ్‌రెడ్డి, జైహింద్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఓటరు నమోదుకు సహకరించాలి



పార్టీల నాయకులతో చర్చిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్

బొంరాస్‌పేట, డిసెంబర్ 14 : వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి రాజకీయ పార్టీల నాయ కులు సహకరించాలని తహసీల్దార్ వెంకటేశ్ కోరారు. గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు, డూప్లికేట్ పేర్లు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు వంటి వాటి గురించి వివరించారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. ఓటర్ల జాబితా ఎలాంటి తప్పులు లేకుండా ఉండడానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు నర్సింహులుగౌడ్, మల్లేశ్, బీజేపీ నాయకుడు బాబయ్యనాయుడు పాల్గొన్నారు.

**నవాబుపేట:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్‌వోల దేనని తహసీల్దార్ జయరాం తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో తహసీల్దార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగంచేసుకునేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు రజితారాణి, సుశీల్‌కుమార్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**పెద్దేముల్:** 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీయువకులు నూతనంగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల తహసీల్దార్ కిషన్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలతో ఓటరు నమోదు ప్రక్రియపై పలు అంశాలపై సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటరు జాబితాలో చనిపోయిన,డబుల్‌గా నమోదైనా ఓటర్ల వివరాలను,గ్రామాల్లో శాశ్వతంగా వలస వెళ్లిన కుటుంబాలను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు.అదే విధంగా 90 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్‌కుమార్, సీవో బసంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూల్చివేత పనులను అడ్డుకున్న హనుమాన్‌గండి వాసులు

పరిగి టౌన్, డిసెంబర్14: రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇండ్లను కూల్చివేస్తే నష్టం వాటిల్లు తుందని తమ కు సరైన న్యాయం జరిగే వరకు కూల్చివేత పనులను ఆపాలని పరిగి మండల పరిధిలోని హను మాన్‌గండికి చెందిన గిరిజనులు అధికారులను కోరారు. హైదరాబాద్-బీజాపూర్ అంతరాష్ట్ర రహదారి నాలుగులేన్ల రోడ్డు పనుల విస్తరణలో భాగంగా గురువారం తహసీల్దార్ ఆనంద్‌రావు, ఆర్ఐలు హనుమాన్‌గండికి వెళ్లి గతంలో మార్కింగ్ చేసిన స్థలాలను గుర్తించి కూల్చివేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. తమకు సరైన న్యాయం జరగలేదని కొంత గడువు ఇవ్వాలని కోరడంతో అధికారులు రెండు, మూడు రోజుల గడువు ఇస్తామని ఆతర్వాత కూల్చివేత పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో తండావాసులు నెల రోజుల వ్యవధి కావాలని కోరారు. కొంతసేపు అధికారులు, తండావాసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

### 19న ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కులకచర్ల, డిసెంబర్ 14 : ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి కులకచర్ల మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగవేణి తెలిపారు. 2021జనవరి 1 నుండి 2023మార్చి 31 వరకు గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకంకు సంబంధించిన పనులను గ్రామ స్థాయిలో తనిఖీ నిర్వహించిన పనులకు గాను మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కొనుగోళ్లలో అవకతవకలు జరగొద్దు



పత్తిమిల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, డిసెంబర్ 14: పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ మిల్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని చిన్ననందిగామ గ్రామంలోని విజయ్ ఇండస్ట్రీస్ పత్తి మిల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లలో ఎటువంటి అవకతవకలు జరగవద్దని సూచించారు. అదేవిధంగా అమ్మకాలకు సంబంధించి రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు జరుగుతున్నాయా, మిల్‌లో తీసుకొంటున్న భద్రతా చర్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

### మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దోమ, డిసెంబర్ 14: మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అధికారి గౌస్‌పాషa, సర్పంచ్ రాజిరెడ్డి విన్నవించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ పరిగి ఆధ్వర్యంలో సర్పంచ్ రాజిరెడ్డి అధ్యక్షతన ఈ నెల 30న పరిగిలో నిర్వహించే మెగా లోక్ అదాలత్ న్యాయ విజ్ఞాన సదస్సు పై బాధిత కుటుంబాలకు న్యాయవాదులు,లోక్ అదాలత్ సిబ్బంది అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో భార్యాభర్తల మధ్య వివాదాలు, మనోవర్తి, విడాకులు, పిల్లల మనోవర్తి, సివిల్ కేసులు, భూవివాదాలు, క్రిమినల్ కేసులు,చెక్ బౌన్సు తదితర సమస్యలన్నింటికీ సత్వర పరిష్కారం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నర్సిహా రావు, వేణుగోపాల్, లోక్ అదాలత్ సిబ్బంది మోహన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

### కళా బృందాలతో విద్యార్థులకు అవగాహన

నవాబుపేట, డిసెంబర్14: ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలల్లోని విద్యార్థులకు బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, మాదక ద్రవ్యాలు దుర్వినియోగం వంటి విషయాలపై జిల్లా కళా బృందాలతో అవగాహన కల్పిస్తున్నట్లు కళాబృందం అధికారి అశోక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కళాబృందం అధికారి అశోక్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ భరత్ భూషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువత పుస్తకాల కంటే మొబైల్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని, వాటిని మంచికి కాకుండా చెడుకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారన్నారు. ఇది చాలా ప్రమాదకరమైనా అలవాటు అని, ఎంత గ్గించుకుంటే అంత మంచిదన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా లాభం లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి హరిశ్చంద్ర

పరిగి, డిసెంబర్ 14: విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని పరిగి మండల విద్యాధికారి హరిశ్చంద్ర సూచించారు. గురువారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.1లో పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల పరిధిలోని పాఠశాలల స్కూల్ అసిస్టెంట్‌లకు కాంప్లెక్స్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎల్ఎంతో విద్యార్థులకు మరింత చక్కటి విద్యాబోధన అందించాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి కేంద్రీకరించేలా చూడాలని, వారికి అర్థమయ్యే విధంగా విద్యాబోధన కొనసాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



మన్సాన్‌పల్లిలో వడ్ల తూకాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

పెద్దేముల్, డిసెంబర్ 14 : వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బం దులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మంబాపూర్,మన్సాన్‌పల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కిషన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన గన్నీ బ్యాగుల (బార్దాన్)ను అందుబాటులో ఉంచాలని సూచించారు. అదే విధంగా కొనుగోలు కేంద్రంలో ప్రతి రోజు తూకం చేసిన వడ్లను పరిగి నియోజకవర్గంలోని జాఫర్ పల్లి రైస్‌మిల్‌కు తరలించాలన్నారు. కాగా రెండు రోజుల్లో 743 బ్యాగుల వడ్లను నలుగురు రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు ఆర్డీవో శ్రీనివాస్ రావుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజూరెడ్డి తదితరులు ఉన్నారు.